ఒంటి కాకి

"ఆయనకేం - ఆయన అబ్బాయి అమెరికాలో ఉన్నాడు." ఆ మాట విని భరద్వాజ్ వెనక్కి తిరిగి చూశాడు. అతని వెనుక ఇద్దరు గుసగుస లాడుకుంటూ ఈర్ష్యపడుతున్నారు.

"దేనికైనా పెట్టి పుట్టాలి! " ఎవరో అంటున్నారు.

చిన్నగా నవ్వుకున్నాడు భరద్వాజ్ తన అదృష్టానికి.

పెండ్లిలో చదివింపుల కార్యక్రమం వచ్చింది. భరద్వాజ్ ఘనంగా చెయ్యి నూట పదహార్లు చదివించాడు.

"అంతా డాలర్ మహిమ! ఆయనదేం పోయింది. .. ఓ పాతిక డాలర్లు తమవి కాదనుకుంటే సరిపోయే!" ఇందాకటి వాళ్ళే అనుకుంటున్నారు. .తృప్తిగా నవ్వుకున్నాడు భరద్వాజ్.

పెండ్లి అయిన తరువాత ఇంటికి కారులో వచ్చాడు. భరద్వాజ్ పనిచేసింది మామూలు గుమస్తాగానే!కాని ఇప్పుడు కారు తోలుతున్నాడు. రిటైర్ అయ్యేదాకా సిటీ బస్సులో తప్పించి వెళ్ళేవాడు కాదు.. ప్రతి పైసా ఆచితూచి ఖర్చుచేసేవాడు.

అతని అదృష్టం అతని కొడుకు అనిల్ అమెరికా వెళ్ళినప్పటినుంచి మారింది.

అనిల్ చిన్నప్పటినుంచి కష్టపడి చదువుకునేవాడు . తండ్రి చాలీ చాలని సంపాదనతో ... అతి జాగ్రత్తతో చదువుకునేవాడు. లైబ్రరీలో పుస్తకాలు చదువుకుని... మిత్రుల దగ్గర నోట్సుల రాసుకుని స్కాలర్ షిప్పులు తెచ్చుకుని తండ్రికి తన చదువు భారం తగ్గించాడు. ఇంజనీరింగ్ డిస్టింక్షన్‌లో పాసై.... స్టేట్స్‌కు వెళ్లిపోయాడు.

అనిల్ అమెరికాలో సంపాదిస్తున్నా - అతని ధ్యాస ఇంటి మీద ఉండేది. అతని చిన్నప్పటి పేదరికం అతన్ని వెంబండించేది. అందుకే కడుపు కాల్చుకుని డాలర్లను ఇండియాకు పంపించేవాడు. మారకపువిలువ వలన అవి వేలుగా బ్యాంకులో జమ చేరేవి.

భరద్వాజ్ ఆ డబ్బుతో కూతురు పెండ్లి ఘనంగానే చేయగలిగాడు. కాని క్యాన్సర్ బారిన పడ్డ భార్యను మటుకు బ్రతికించుకో లేకపోయాడు.

ఓ నెల సెలవుకు వచ్చిన అనిల్ కు మటుకు పెండ్లి చేసి పంపించాడు. సదపెండ్లి అయిన తర్వాత వారం కూడా అతను ఇండియాలో ఉండలేకపోయాడు. వెంటనే వెళ్ళిపోయాడు.

ఆ తరువాత వీసా పంపి భార్యను అమెరికాకు తెప్పించుకున్నాడు.

భరద్వాజ్ పెద్ద ఇల్లు అయితే కట్టుకున్నాడు - కాని కళకళ లాడుతూ తిరిగే దానికి కొడుకు, కోడలు లేరు. కూతురు , అల్లుడు ఎప్పుడో తప్పించి రారు భార్య కాలం చేసింది. ఇల్లు బోసిపోతూంటుంది.

అనిల్ తరుచూ ఫోన్లు చేస్తూ ఉంటాడు. పోస్టులో తమ ఫోటోలు పంపుతూ ఉంటాడు. ఇప్పుడో కోడలు కూడా ఉద్యోగం చేస్తున్నది. సంపాదన బాగానే ఉంది. పెళ్ళయిన తర్వాత కూడా డబ్బు పంపిస్తానంటే తిర్కసించాడు భరద్వాజ్ - ఒంటిలింగం శొంఠికొమ్మును నాకెందుకు, నువ్వే దాచుకో అని చెప్పి.

కారులో ఇంటికొచ్చి గేటు లాక్ చేసి లోనికి వచ్చిన భరద్వాజ్‌కు ఎందుకో అనీజీ.

టీవి ఆన్ చేశాడు - ఛానల్స్ తిప్పాడు . ఏప్రోగ్రాం మీదా మనసు నిలవడం లేదు . ఆల్బమ్స్ అన్నీ తిరగవేశాడు ... జ్ఞాపకాలు ముసురుకున్నాయి, ఒంటరి తనం వెక్కిరిస్తున్నది.

కొడుకు, కూతురు, భార్య తను చిన్నప్పుడు గడిపిన జీవితం గుర్తుకొచ్చింది. అప్పుడు తాను ఒక గుమస్తా– చాలీచాలని జీతంతో బ్రతుకు బండి లాగించిన గుమస్తా! కాని నలుగురు కలిసి ఒకే గూడు కింద ఉండేవాళ్ళు. కష్టాలు – సుఖాలు పంచుకున్నారు. తోచకపోవటం అంటూ ఉండేది కాదు – అసలు టైం సరిపోయేది కాదు.

ఇప్పుడు –

ఎవరికి వారే యమునా తీరే!

ఫోన్ రింగయింది.

"హలో డాడ్! నేను అమెరికా నుండి – ఎలా ఉన్నావు? నీ ఆరోగ్యం బాగుందా? చెల్లాయి బాగుందా!"

"అందరం బాగున్నాం .. కాని నువ్వు ఎప్పుడు వస్తున్నావు?" ఆత్రంగా అడిగాడు. "నిన్ను చూసి చాలా కాలమైంది రా!"

"ఐసీ! అయితే ఫోటోలు... వీడియో క్యాసెట్లు పంపిస్తాను."

"నో! నేను నిన్ను చూడాలి... సెలవు పెట్టిరా!"

"అయ్యో! ఇది అమెరికా. ఎప్పుడుపడితే అప్పుడు సెలవులు దొరకవు... దీనికి సీజను కావాలి."

"మరి నాకు దిగులు ఎక్కువై పోతున్నది... నిన్ను చూడాలని."

"ఓ పని చేద్దాం... మేమిద్దరం రావడం ఎందుకు దండుగ.. ఒకే టిక్కెట్టు మీద నువ్వు అమెరికా వచ్చెయ్యి... నేను ఆ ఏర్పాట్లు చేసి టిక్కెట్లు పంపిస్తాను..." అనిల్ చెప్పాడు.

భరద్వాజ్ మనసు దూదిపింజలా తేలికయింది. వాడు వెళ్ళిన నాలుగేళ్ళకు తను అమెరికా వెళ్ళగలుగుతున్నాడు.

రాత్రి పది అయినా వెంటనే బయటకొచ్చి... ఎదురింటి వరండాలో మంచం మీద కునికిపాట్లు పడుతున్న ఆనందరావుకు తెలియజేశాడు – తను అమెరికా వెళుతున్నట్టు... అతను ఈర్ష్యగా అభినందించాడు.

మార్నింగ్‌వాక్‌కు వచ్చిన వృద్ధస్నేహితులందరికీ తెలియజేశాడు తన అమెరికా యాత్ర గురించి.

"ఒరే భరద్వాజ్! అమెరికాలో ఎన్ని రోజులుంటావురా!" అడిగాడు ఆప్తమిత్రుడు కౌశిక్.

"నేనింక రానురా ... అక్కడ నాకు కొడుకూ, కోడలున్నారు ... వాళ్ళతోనే ఉంటూ ... చచ్చేదాకా ఆ భూతల స్వర్గంలో ఉండిపోతా!" చెప్పాడు భరద్వాజ్.

"అరే! మమ్మల్ని అందరినీ వదిలేసి వెళ్ళిపోతావా!" కౌశిక్ దిగులుపడ్డాడు.

"నాకూ దిగులుగానే ఉంది – కాని పోతున్నది అనకాపల్లికి కాదుగా అమెరికాకు క్షణం తీరిక దొరకని దేవలోకానికి... కన్నకొడుకు దగ్గరకు..." చెప్పాడు కళ్ళు తుడుచుకుంటూ.

అలా రోజులు గడుస్తున్నాయి రాబోయే మంచి రోజుల గురించి కలలుకంటూ.

భరద్వాజ్ ఆశించిన ఆ శుభ ముహూర్తం రానే వచ్చింది.

వాళ్ళ ఆప్యాయతకు కన్నీళ్ళు తిరిగాయి.

కొడుకు – కోడలు – కూతురు, అల్లుడు ఆ ఊళ్ళో లేకపోయినా అతని యోగక్షేమాలు రోజూ చాలా మంది విచారించే వారు ... అందరి దగ్గర వీడ్కోలు తీసుకున్నాడు...

కొండంత ఆనందంతో విమానం ఎక్కాడు. తన జీవితంలో విమానం ఎక్కగలననుకున్నాడా?

హాలిడే కావడంతో కొడుకూ, కోడలూ వచ్చి రిసీవ్ చేసుకున్నారు ఎయిర్ పోర్ట్‌లో....

లంకంత ఇల్లు ...సువిశాలమైన పచ్చిక మైదానాల్లో విసిరేసినట్లు ఇళ్ళు...

కొన్నాళ్ళు అమెరికా విశేషాలతో కాలం పరుగెత్తింది...

చుట్టుప్రక్కల వాళ్ళతో పరిచయాలు జరిగినా – అక్కడంతా టైము సెన్స్ పాటిస్తారు కనుక ఎప్పుడు పడితే అప్పుడు మాట్లాడుకోవడానికి వీలయ్యేది కాదు, అప్పాయింట్‌మెంట్ తీసుకోవాలి.

కొడుకు ఓ కారులో ఓ ఇరవై కిలోమీటర్ల దూరంలో ఇంజనీరింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. పొద్దునపోతే – రాత్రికే వచ్చేది . బాగా అలసిపోయే వాడు... కోడలు కూడా ఉదయాన్నే ఓ పాతిక కిలోమీటర్లు డ్రైవ్ చేసుకుని వెళ్ళి ఓ ఉద్యోగం వెలగబెట్టి రాత్రికే వచ్చేది.

డాలర్లు ఇచ్చేవాడు ముద్దుగా చూడడుగా.. వారిలోని శక్తిని పీల్చి పిప్పి చేసేవాడు. అలసిపోయి పడుకునేవాళ్లు . భోజనాలు కాగానే మాటా మంచీ లేకుండా. భరద్వాజ్‌కు ఉదయం నుంచి వాళ్ళు తిరిగి వచ్చే దాకా మహా బోరుగా ఉండేది. ఎంత సేపని టీవి ముందు కూర్చోగలడు?

రోజులు గడిచే కొద్దీ ఏదో వెలితి...

హాలిడేసులో కూడా ఏవో ఫిక్సుడ్ ప్రోగ్రాంలు – అందరూ యాంత్రికంగా పరుగెత్తుతున్నవాళ్ళే!

అంతా డాలర్ల మయం .....లాభనష్టాల బేరీజులు.

కల్చరు గ్యాప్!కొన్ని సంవత్సరాలు ...అర్ధ శతాబ్దం పైన వెనక బడిపోయిన ఇండియా.....

"అబ్బాయ్ !నన్ను ఇండియాకు పంపిచెయ్యి" ఓ రోజు భరద్వాజ్ యాధాలాపంగా అడిగాడు.

"ఏం? ఇక్కడ బాగా లేదా?" కోడలు ప్రశ్న.

"పోయి ఏం చేస్తావు?" అనిల్ ప్రశ్న.

"ఇక్కడ పలుకరించే దిక్కులేదు" చెప్పాడు.

ఆ మాటకు అనిల్ కు కోడలుకు కోపం వచ్చింది.

"ఇంకేం చేయాలి, ఉద్యోగాలు మానుకుని మీతో కబుర్లు చెబితే కడుపులు ఎలా నిండుతాయి? కోడలి ప్రశ్న.

"నువ్వు పాతకాలం మనిషివి నాన్నా – మారాలి" కొడుకు.

"ఏమోరా!నాకీ వాతావరణం నచ్చలేదు..ఇండియాకు పోదామని ఉంది." తెగించి చెప్పేశాడు.

మూడు నెలలకల్లా ఇంటి ముందరవాలిన భరద్వాజ్‌ను చూసి కౌశిక్ బోల్డు ఆశ్చర్యపోయాడు.

"అదేంటిరా – అప్పుడే వచ్చేశావు ?జీవితాంతం అక్కడే ఉండి పోతానని ప్రగల్భాలు పలికావు."

అబ్బా నాకు ఆనందంగా ఉంది ఇప్పుడు ఇది బీద దేశమే కావచ్చు – ఇక్కడ పెద్ద నాగరికత లేకపోవచ్చు అభివృద్ధి కుంటుపడి ఉండవచ్చు – కాని ఇది నా మాతృదేశం – నన్ను కన్న దేశం ఈ గాలి- ఈ నీరు చాలునాకు"! కళ్ళు చెమరుస్తూంటే అన్నాడు భరద్వాజ్.

"ఏమోరా కొడుకు, కోడలు సరిగ్గా చూడలేదా?" కౌశిక్ అడిగాడు.

"అదేం లేదు ...వాళ్ళు అమెరికన్లు లాగా తయారయ్యారు రా అంతా టైమ్ ....మనీ ..కాలము..వేగము ..డబ్బు ....ఇదే జీవితం ఒరే నీలాగా ఆప్యాయంగా పలకరించే ది లేదురా భరద్వాజ్‌క్కు

తన అనుభవాలు చెప్పాడు.

"ఐసీ! అయితే డబ్బులో సుఖం లేదన్నమాట?"

"నీ మొహం! అభిమానం – ఆప్యాయతల్లో ఉన్న ఆనందం ఇంకెక్కడా ఉండదురా! నేను ఇక్కడ ఒంటరివాడ్ని కాదు... నలుగురూ నా కోసం వస్తారు... నలుగురు నా కోసం బాధపడతారు... నేను ఎంత సేపైనా మాట్లాడగలను. కాలం చేతిలో నేను లేను. నా చేతిలో కాలం ఉంది." భరద్వాజ్ ధారాళంగా మాట్లాడుతున్నాడు.

"అరే! మితభాషిని ఇలా అయిపోయావేంటిరా!"

"అక్కడ మాట్లాడే వారే కరువయ్యారు... మన తెనుగు భాష మాట్లాడి మొహం వాచిపోయింది. అస్సలు మనుషులు దొరికితేగా మాట్లాడ్డానికి," వాపోయాడు.

"భరద్వాజ్! దూరపు కొండలు మనుపు అని... అమెరికా జీవితాల గురించి మనం గొప్పగా ఊహించుకుంటాం... కాని దిగితే గాని లోతు తెలియదని ... అక్కడి సుఖాలతో పాటు అక్కడి దుఃఖాలు భరించే శక్తి మనకు లేదు," కౌశిక్ అన్నాడు.

"మనిషికి ఒంటరితనమే పెద్ద శిక్షరా! ఇక్కడ ఆ ఒంటరి తనం కొట్టొచ్చినట్టు కనపడదు – ఇక్కడ అందరి విషయాలు అందరికీ కావాలి... అక్కడ ఎవరి విషయం ఎవరికీ అక్కరలేదు. ఇంక మళ్ళీ రమ్మన్నా రాను... పొమ్మన్నా పోనురా అమెరికాకు.... ఈ శేష జీవితం మన మధ్యలో వెళ్ళిపోతే చాలు!" కన్నీరు తుడుచుకుంటూ చెప్పాడు భరద్వాజ్.

"మనిషి సంఘజీవి! ఆదిమ మానవుడు సంఘ జీవిగా జీవితం మొదలుపెట్టి నాగరికత నేర్చుకుని గ్రామాలు, నగరాలు, పట్టణాలు నిర్మించుకుని – చివరికి నాగరికత బలిసిపోయి మెగాసిటీలు కట్టుకుని ... కాంక్రీటు బిల్డింగుల్లో బందీ అయిపోయి ... చివరికి ఒంటరివాడైపోయాడు!" కౌశిక్ వ్యాఖ్యానించాడు.

"కల్చరు కల్చరు అంటూ – పర్సనల్ పర్సనల్ అంటూ ... తన వారికి దూరమైపోయి ... ఒంటికాకిలాగా మారిపోయాడు మనిషి! ఒకే ఇంట్లో ఉన్నా... అంతరాలు ఏ సౌకర్యం పూడ్చలేనంత ఎక్కువగా తయారవుతున్నాయి" భరద్వాజ్ వాపోయాడు.

"డబ్బును సంపాదించే ప్రయత్నంలో మనిషి డబ్బు యంత్రంగా మారిపోతున్నాడు. చివరికి ఆ సంపాదన ఎందుకోసమో .. ఎవరికోసమో కూడా తెలుసుకోలేనంత ఇదిగా ఆ డబ్బు కింద కూరుకుపోయాడు .. మనిషికి డబ్బు జబ్బు చేసింది," కౌశిక్ ఆవేదన.

"కార్లు ... విమానాలు మనిషికి మనిషికి మధ్య ఉన్న భౌతిక దూరాన్ని దగ్గరికి తేగలవు, కాని మనసుకు మనసుకు మధ్య ఉన్న దూరాన్ని ఏ సాధనం దగ్గరికి తేగలదు. ఈ ఒంటరితనాన్ని ఏ సైన్స్ పరికరం పోగొట్టగలదు?" కన్నీరు తుడుచుకోకుండా ప్రశ్నించాడు భరద్వాజ్ కౌశిక్ రెండు చేతులు పట్టుకుని.

"అనుబంధం – ఆత్మీయతల ద్వారా!" ఓదారుస్తూ చెప్పాడు కౌశిక్.

(27 అక్టోబర్ 2000 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక)